క్లుప్తంగా

బాధ్యతలు చేపట్టిన సీఐ ప్రతాప్



సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం టూటౌన్ సీఐగా డి.ప్రతాప్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన టి.రమేష్‌కుమార్ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. హైదరాబాద్‌లో వెయిటింగ్‌లో ఉన్న ప్రతాప్ కొత్తగూడెం టూటౌన్‌కు బదిలీపై వచ్చారు.

నేడు గిరిజన ఉద్యోగుల క్రికెట్ టోర్నీ

పాల్వంచరూరల్: కిన్నెరసానిలోని గిరిజన క్రీడా పాఠశాల మైదానంలో ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఉద్యోగుల క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాల్‌రావు తెలిపారు. శనివారం క్రీడా మైదానాన్ని సిద్ధం చేశారు. టోర్నీలో భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం, పాల్వంచ, ఇల్లెందు, దమ్మపేట డివిజన్ల జట్ల క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో రుద్రహోమం

పాల్వంచరూరల్: మాస శివరాత్రి సందర్భంగా ఆదివారం పెద్దమ్మతల్లి ఆలయంలో రుద్ర హోమం, 29వ తేదీన హుండీ కానుకల లెక్కింపు జరపనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు రూ.1,516 చెల్లించి గోత్ర నామములను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 6303408458 నంబరులో సంప్రదించాలని కోరారు.

రేపటి నుంచి అంకమ్మ తల్లి జాతర

సుజాతనగర్: రాఘవాపురం గ్రామంలో ఈ నెల 26 నుంచి జూన్ 2వ తేదీ వరకు అంకమ్మ, మహాలక్ష్మమ్మ జాతర జరగనుంది. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు, అధికారుల సమక్షంలో శనివారం ఆలయంలో కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కె.నాగరాజు, ఎస్‌ఐ ఎం.రమాదేవి, అర్చకులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ శిబిరం

ఇల్లెందురూరల్: విద్యార్థి మేధస్సుకు అనుగుణంగా బోధన చేపట్టాలని ఎంఈఓ ఉమాశంకర్ సూచించారు. సుభాష్‌నగర్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న వృత్యంతర శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి బడికి వెళ్లేందుకు ఆసక్తి పెంచుకునేలా ఆటపాటలతో బోధనకు ప్రాధాన్యమివ్వాలన్నారు.

ఇంకుడు గుంతలు నిర్మించాలి

ఇల్లెందు: మున్సిపాలిటీలోని ఖాళీ స్థలాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ కోరారు. శనివారం పట్టణంలోని శ్మశానవాటిలో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టారు. మాట్లాడుతూ... పట్టణంలో ఇప్పటి వరకు 60 ఇంకుడు గుంతల నిర్మాణం చేసినట్లు తెలిపారు. ఇంకుడు గుంతలు వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు.

సొసైటీ చైర్మన్‌కు పరామర్శ

జూలూరుపాడు: కాకర్ల గ్రామానికి చెందిన జూలూరుపాడు సొసైటీ చైర్మన్ చీమలపాటి భిక్షం సతీమణి రాధమ్మ(48) రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందిన విషయం విదితమే. శనివారం రాధమ్మ భౌతికాయాన్ని పలు పార్టీల నాయకులు, ఉద్యోగులు సందర్శించి, పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించి ఆమె కుటుంబీకులను పరామర్శించారు. సంతాపం తెలిపిన వారిలో కాంగ్రెస్ నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, పొన్నెకంటి సతీష్ కుమార్, దుద్దుకూరి మధుసూదన్ రావు దొండపాటి శ్రీనివాసరావు, బానోత్ లాలు నాయక్, వేల్పుల నరసింహారావు, కాళ్లూరు వెంకటేశ్వరరావు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ముమ్మరం

సుజాతనగర్: సుజాతనగర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా జరుగుతోంది. అకాల వర్షాలు, వాతావరణ మార్పుల కారణంగా త్వరితగతిన ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల విజ్ఞప్తి మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కొనుగోళ్లు మొదలైనప్పటి నుంచి హమాలీలు, లారీల కొరతతో రైతులు ఇబ్బంది పడ్డారు. తేమ శాతం అధికంగా వస్తోందని, తరుగు పేరుతో మిల్లర్లు మెలిక పెట్టారు. దీంతో ధాన్యం సేకరణలో తీవ్ర జాప్యం జరిగింది. నాలుగైదు రోజులుగా లారీల సంఖ్య, హమాలీల సంఖ్యను పెంచారు. తూర్పార బట్టే మిషన్లు కూడా పెంచారు. ప్రస్తుతం రోజుకు మూడు నుంచి నాలుగు లారీల ధాన్యం మిల్లులకు వెళ్తోంది. ఇంకా 40 నుంచి 50 లారీల ధాన్యం ప్రస్తుతం కేంద్రంలో ఉంది. మిగిలిన ధాన్యాన్ని కూడా త్వరితగతిన తరలించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సింగరేణి ఐకాన్ ప్రగతివనం పార్క్!

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్‌లో ప్రగతివనం పర్యావరణానికి కేంద్ర బిందువుగా విరాజిల్లుతోంది. కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు 2015లో ఆనాటి సింగరేణి అధికారులు ఈ పార్క్‌ను 25 లక్షల వెచ్చించి నిర్మించారు. పార్క్‌లో ఫౌంటెన్‌తోపాటు, పలు రకాల జంతువుల బొమ్మలు, పిల్లలు ఆడుకునేందుకు ఊయ్యాలలతోపాటు, మరెన్నో వస్తువులను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా పార్క్ సమీపంలో ధన్‌బాద్ చెరువును అనుసంధానం చేస్తూ మరో ట్యాంకు బండ్ మాదిరిగా చుట్టూ విద్యుత్ వీధిలైట్లు ఏర్పాటు చేశారు. ప్రధానంగా ఎంట్రన్స్‌లో సింగరేణి కార్మికుడి ఆకృతి, రంగురంగుల పూల మొక్కలు, ధ్యాన కేంద్రం, ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. వేసవికాలంలో సాయంత్రం సమయంలో ఈ పార్క్‌ను స్థానికులతోపాటు, ఇతర ప్రాంతాలవారు సందర్శిస్తుంటారు. అంతేకాకుండా ఈమధ్య కాలంలో సినిమా షూటింగ్‌లు, ప్రీ వెడ్డింగ్ షూట్ కూడా తీసుకోవడం విశేషం.

సండే స్పెషల్



సింగరేణి కార్మికుడి ప్రతిమతో ప్రగతివనం పార్క్



జిరాఫీ బొమ్మను తిలకిస్తున్న పర్యాటకులు



ధన్‌బాద్ చెరువు చుట్టూ లైటింగ్



పార్క్‌లో ఊయలలూగుతున్న చిన్నారులు

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



బొమ్మనపల్లిలో బ్రిడ్జిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

టేకులపల్లి: రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శనివారం బేతంపూడి సొసైటీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన రైతులకు సబ్సిడీపై జీలుగ, జనుము విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వి.బాబూరావు, ఏడీఏ లాల్ చంద్, ఏఓ అన్నపూర్ణ, తహసీల్దార్ ముత్తయ్య, సీఈఓ ప్రేమాచారి, డైరెక్టర్లు కృష్ణార్జున్‌రావు, బాలాజీ, లక్ష్మీనారాయణ, ఉదయ్, రమణ, శ్యామ్, ఇస్తారి పాల్గొన్నారు. అనంతరం బొమ్మనపల్లి–శంభునిగూడెం రహదారి మధ్యలో నిర్మించిన బ్రిడ్జిని ఎమ్మెల్యే ప్రారంభించారు. గోలియాతండా పంచాయతీలో సామ్యావాగు వద్ద రూ.45 లక్షలతో నిర్మించనున్న బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జేఎల్ గాంధీ, కోరం సురేందర్, భూక్యా దేవా, ధర్మయ్యగౌడ్, బోడ మంగీలాల్, ఈది గణేష్, బోడ నిరోషా, రెడ్యానాయక్, పూన్యా, శంకర్, పోశాలు, మోహన్ రావు, సర్దార్, రవి, నర్సయ్య పాల్గొన్నారు.

వంద శాతం రిజర్వేషన్లు కల్పించాలి

టేకులపల్లి: రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతంలో విద్య, ఉద్యోగ ప్రమోషన్లలో వంద శాతం రిజర్వేషన్లు ఆదివాసీ విద్యార్థి, ఉపాధ్యాయులకు కేటాయించాలని, జీఓ నంబర్ 3 పూర్తి స్థాయిలో పునరుద్ధరణ లేదా దాని స్థానంలో కొత్త చట్టం తేవాలని టీఎస్ ఏటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ముగిసిన ఉపాధ్యాయ, వ్యాయామ ఉపాధ్యాయ శిక్షణా తరగతుల కేంద్రాలను సందర్శించి ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. ఆదివాసీ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కొరకు, జాతి సమస్యల పరిష్కారంలో ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కుంజ కృష్ణ, భద్రాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి చావల రమేష్ బాబు జిల్లా కార్యవర్గం పూనెం బాలరాజు, ఊకె కృష్ణ, పాయం రమేష్, కుంజ శిరీష, ఇల్లెందు బాధ్యులు కొడెం కృష్ణయ్య, తోలెం ఈశ్వర్, ఆరేం రవికుమార్, ఊకె పగడయ్య, స్వరూప, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

గిరిప్రసాద్ ఆశయాలు సాధిద్దాం..



పాల్వంచ: నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

జూలూరుపాడు: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, సీపీఐ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి నల్లమల్ల గిరిప్రసాద్ 29వ వర్ధంతిని సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో శనివారం జూలూరుపాడులో నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిప్రసాద్ చిత్రపటానికి సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమం కోసం, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నిరుపేదలకు భూమి పంచిన మహనీయుడు గిరిప్రసాద్ అని కొనియాడారు. గిరిప్రసాద్ ఆశయ సాధనకు ప్రతీఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కే నాగుల్‌మీరా, మండల కార్యదర్శి ఎస్కే చాంద్‌పాషా, గార్లపాటి వీరభద్రం, చెరుకుమల్ల రామకృష్ణ, కొట్టే శ్రీను, నిమ్మటూరి లచ్చయ్య, పత్తిపాటి మహేష్, దేవినేని రాము, శివ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాల్వంచ: కార్మిక, కర్షక, పేద ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన నల్లమల్ల గిరిప్రసాద్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. రాజ్యసభ మాజీ సభ్యుడు నల్లమల్ల గిరిప్రసాద్ 29వ వర్ధంతి సందర్భంగా సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు శనివారం చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి వీసంశెట్టి రాహుల్, పద్మజ, గుండాల నాగరాజు, చెన్నయ్య, అన్నరాపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకట్రావ్, శ్రీను, నరహరి నాగేశ్వరరావు, వెంకన్న పాల్గొన్నారు.

సూపర్‌బజార్(కొత్తగూడెం): కార్మిక, కర్షక, పేదప్రజల హక్కుల కోసం నిరంతర పోరాటం చేసిన నల్లమల గిరిప్రసాద్ ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయారని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా అన్నారు. స్థానిక శేషగిరిభవన్‌లో శనివారం తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సీపీఐ జాతీయ ఉప ప్రధాన కార్యదర్శి నల్లమల గిరిప్రసాద్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కొరిమి రాజ్‌కుమార్, చంద్రగిరి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, జి.వీరస్వామి, భూక్యా శ్రీనివాస్, కేశవరావు, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ కిటకిట

ఇల్లెందు: రోజురోజుకు ప్రయాణం మరిత కష్టతరంగా మారుతోంది. ఇల్లెందు ఆర్టీసీ బస్ స్టేషన్‌లోకి ఒక్క బస్ వస్తే చాలు ప్రయాణికులు ఎగబడుతున్నారు. ఇల్లెందు – మహబూబాబాద్ మధ్య సరిపడ బస్‌లు లేక ప్రయాణికులకు నిత్యం ఇబ్బంది పడుతున్నారు. శనివారం బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడింది. బస్ స్టేషన్‌లో ఏ బస్ చూసినా రద్దీ కనిపించింది. ఆర్టీసీ నష్టాలు తగ్గించుకోవాలని ఇటీవల ఆ సంస్థ రీజియనల్ ఈడీ సోలోమెన్ ఇల్లెందులో అధికారులకు పలు సలహాలు సూచనలు ఇచ్చారు. కానీ 15 రోజులుగా ఒక్కటి కూడా అమలు కాలేదు. దీనికి తోడు ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రారంభించిన సత్తుపల్లి, మణుగూరు సర్వీస్‌కు ప్రయాణికుల ఆదరణ లేదని రద్దు చేశారు. ఇక ఇల్లెందు – హైదరాబాద్ ఏసీ బస్, గుండాల – హైదరాబాద్ సర్వీస్, గుండాల ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లు కూడా కార్యాచరణకు నోచుకోవడం లేదు.



మహబూబాబాద్ బస్ కోసం ప్రయాణికుల పరుగులు

డయల్ యువర్ డీఎంకు స్పందన

చుంచుపల్లి: కొత్తగూడెం ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యలపై శనివారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. వాటిలో ముఖ్యంగా ఇల్లెందు మార్గంలో బొజ్జాయిగూడెం వద్ద, సత్తుపల్లి మార్గంలో పెనగడప వద్ద అన్ని బస్సులు ఆపాలని, ఖమ్మం రూట్‌లో సాయంత్రం డీలక్స్ బస్సులు సర్వీసులు నడపాలని పలువురు కోరారు. పాల్వంచ నుంచి అశ్వారావుపేట వైపు ఉదయం 7 గంటలకు ఒక బస్సు నడపాలని కోరారు. తమ దృష్టికి తెచ్చిన సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని డీఎం దేవేందర్‌గౌడ్ తెలిపారు.

పాలిసెట్‌లో సత్తా చాటిన విద్యార్థులు

ఇల్లెందు: ప్రభుత్వం ప్రకటించిన పాలిసెట్ ఫలితాల్లో ఇల్లెందు విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. పట్టణంలోని శ్రీ గురుదత్త కోచింగ్ సెంటర్‌లో నలుగురు ర్యాంకులు సాధించారని నిర్వాహకులు పుట్టా విజయ్‌కుమార్, లక్ష్మణ్, వి.మహేందర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఇల్లెందులో వారు మాట్లాడారు. జి. చరణ్–2,007 ర్యాంక్, పి. కావ్యశ్రీ –2,378, ఎం. సిద్దార్థ– 2,691, ఎం.వరుణ్ సందేష్ – 2,786 ర్యాంకులు సాధించారని తెలిపారు. విద్యార్థులను మార్గదర్శిని విద్యాసంస్థల డైరెక్టర్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, యాదగిరి రాంబాబు, అర్వపల్లి రాధాకృష్ణ అభినందించారు.

సైనిక్ స్కూల్ ఫలితాల్లో..

టేకులపల్లి: ఇటీవల ప్రకటించిన సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో టేకులపల్లికి చెందిన గ్రావిటీ ప్రీమియర్ స్కూల్ విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. ఈ మేరకు శనివారం పాఠశాల ప్రిన్సిపాల్ బొడ్డుపల్లి బ్రహ్మాచారి మాట్లాడుతూ... తమ పాఠశాల విద్యార్థులు ఎం.అఖిల్, ఎల్.చేతన్‌కుమార్, బి.జస్వంత్ రాం, బి.అన్వేష్, బి.శరత్ సైనిక్ స్కూల్‌లో సీటు సాధించినట్లు తెలిపారు.

30లోపు దరఖాస్తు చేసుకోండి..

పాల్వంచరూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యనభ్యసించి నిరుద్యోగులుగా ఉన్న పూర్వ విద్యార్థులకు గురుకుల విద్యాసంస్థ వృత్తి నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు పాల్వంచ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల సీఓఈ ప్రిన్సిపాల్ ఎం.అన్వేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 – 25 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారు ఈనెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గురుకుల విద్యాసంస్థ ఉన్నతి ఫౌండేషన్ సహకారంతో ప్రతీరోజు మూడు గంటల పాటు 30 రోజులు ఈ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో అధిక విస్తీర్ణంలో రైతులు పత్తి సాగు చేస్తున్నారని నకిలీ విత్తనాల అమ్మకాలపై చర్యలు తీసుకోవాలని జిల్లా యువజన కాంగ్రెస్ నాయకుడు బానోత్ రాజ్‌కుమార్ శనివారం జిల్లా వ్యవసాయాధికారి వి.బాబూరావుకు వినతిపత్రం అందజేశారు. నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహనా సదస్సులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేడు విద్యుత్ బంద్

పాల్వంచ: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా నేడు పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏడీఈ రహముల్ హుస్సేన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుండి 10గంటల వరకు బస్టాండ్ ఏరియా, పాల్వంచ మార్కెట్, బొల్లేరుగూడెం, కేఎస్‌పీ రోడ్, పాత పాల్వంచ, నవభారత్, యర్రగుంట, అయ్యప్పనగర్, శ్రీనివాస కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేషనల్ బ్యాంక్ బ్రాంచ్ ప్రారంభం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలో నూతనంగా ఏర్పాటు చేసిన నేషనల్ బ్యాంకు మొదటి బ్రాంచ్‌ను శనివారం సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ ప్రారంభించారు. మాట్లాడుతూ... ఈ బ్యాంకు ద్వారా కొత్తగూడెంలోని పలు పరిశ్రమలకు, ప్రజలకు ఎన్నోరకాలుగా సేవలు అందించటం, సింగరేణి సంస్థలోని కార్మికులకు రూ.1.25 కోట్ల ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్మికులకు ఈ బ్యాంకు ద్వారా ఉత్తమ సేవలు అందించాలని బ్యాంకు ఉన్నతాధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు డిప్యూటీ జీఎం సికింద్రాబాద్ సర్కిల్ హెడ్ సుజిత్‌కుమార్ ఝా, జీఎం పర్సనల్ (వెల్ఫేర్) జీవీ.కిరణ్‌కుమార్, జీఎం సెక్యూరిటీ లక్ష్మీనారాయణ, ఏజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, డీజీఎం ముకుంద సత్యనారాయణ డీవైపీఎం బి.సుశీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న సింగరేణి సీఎండీ బలరామ్

ఆలయ పాలకవర్గాలను నియమించాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): భద్రాచలం, అన్నపురెడ్డిపల్లి దేవాలయాలలో పాలకమండలి కమిటీలను నియమించాలని తొలి, మలి 1969 తెలంగాణ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రావణబోయిన నర్సయ్య డిమాండ్ చేశారు. శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక దరఖాస్తులు స్వీకరించడం హర్షణీయమని కానీ, ఆరు నెలలు గడిచినా పాలకమండలిలను నియమించకపోవడం ప్రజలను అవమానించడమేనన్నారు. తక్షణమే కమిటీలను ఏర్పాటు చేసి ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో బి.హనుమయ్య, డి.రామ్మూర్తి, కారుణమ్మ, కె.సైమన్, కవిత, టి.శోభ, డి.శ్రీనివాస్, లక్ష్మి, రాములు పాల్గొన్నారు.

ఏజెన్సీలో ప్రత్యేక చట్టం చేయండి..



మాట్లాడుతున్న హనుమంతరావు

పాల్వంచ: ఐదో షెడ్యూల్ ప్రాంతంలో తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకొచ్చేందుకు తీర్మానం చేసి అసెంబ్లీ ఆమోదించాలని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సోయం హనుమంతరావు అన్నారు. శనివారం స్థానిక కొమ్ముగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద వృత్యంతర శిక్షణ కేంద్రంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఏటీఏ సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని, గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న గ్రేడ్ 2 బాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల అప్‌గ్రేడేషన్ ప్రక్రియకు ప్రత్యేక చొరవ చూపాలని, ఆశ్రమ పాఠశాలలకు ఉపాధ్యాయ, బోధనేతర సిబ్బంది పోస్టు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కల్లూరి బొర్రయ్య, సోయం కృష్ణ, కొమరం నారాయణ స్వామి, నాగలక్ష్మి, వర్స చంద్రశేఖర్, తెల్లం సరస్వతి, సున్నం రమేష్, పూనెం ఎర్రమ్మ, వజ్జ కృష్ణమూర్తి, ఈసం కల్పన, కృష్ణకుమారి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల మూసివేత గర్హనీయం

ఇల్లెందు: రాష్ట్ర వ్యాప్తంగా సాంఘిక సంక్షేమశాఖలో 12 ఇంటర్మీడియట్ గురుకులాలను మూసివేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటం గర్హనీయమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మంద నాగకృష్ణ, బయ్యా అభిమన్యు పేర్కొన్నారు. శనివారం ఇల్లెందులో ఎస్ఎఫ్ఐ సమావేశంలో మాట్లాడారు. గురుకులాల మూసివేత నిర్ణయం వెనక్కి తీసుకోవాలని కోరారు. ఈ నిర్ణయం పేద, బలహీన వర్గాల విద్యార్థులకు చదువును దూరం చేస్తుందన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలను మూసివేసి కార్పొరేట్ విద్యాసంస్థలకు మేలు చేసేందుకే ఈ ఆలోచన అని ఆరోపించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భద్రాచలంలోని ఎస్‌సీ గురుకులం, ఖమ్మంలోని కూసుమంచిలో రెండు గురుకులాలు మూసివేత జాబితాలో ఉన్నాయని తెలిపారు. ఈ నిర్ణయాన్ని విరమించుకుని విద్యార్థులు పెరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రామ్, చరణ్, సునిల్ కుమార్, అన్వేష్, రాజు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు తరలిన నిరుద్యోగులు

జూలూరుపాడు: వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో సింగరేణి కాలరీస్ సహకారంతో వైరా ప్రభుత్వ జిల్లా ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు నిరుద్యోగ, యువతీ, యువకులు తరలివెళ్లారు. జూలూరుపాడు నుంచి వైరాకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల్లో, ఇతర వాహనాల్లో నిరుద్యోగులను అధికారులు, పోలీసులు, పంచాయతీ కార్యదర్శులు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా నిరుద్యోగులకు ఎంపీడీఓ డి.కరుణాకర్ రెడ్డి, సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్‌ఐ బాదావత్ రవి, ఎంపీఓ టి.తులసీరామ్, ఏఎస్‌ఐ మల్లయ్య, హెడ్ కానిస్టేబుల్ దయానంద్, పంచాయతీ కార్యదర్శులు, కాంగ్రెస్ నాయకులు ఆల్ ది బెస్ట్ చెప్పారు. కార్యక్రమంలో లేళ్ల వెంకటరెడ్డి, మాలోత్ మంగీలాల్ నాయక్, కంచర్ల హరీష్, దుద్దుకూరి మధుసూదన్‌రావు, దొండపాటి శ్రీనివాసరావు ఉన్నారు.



జూలూరుపాడు నుంచి జాబ్‌మేళాకు బస్సులో వెళ్తున్న నిరుద్యోగులు

ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ..

బస్ ప్రయాణికుల అవస్థలు



టేకులపల్లి సెంటర్‌లో ఇల్లెందు వెళ్లే ప్రయాణికులు



వేచి ఉన్న కొత్తగూడెం వైపు వెళ్లే ప్రయాణికులు

- ప్రధాన కూడళ్లలో షెల్టర్లు నిర్మించాలి
- డిమాండ్ చేస్తున్న మండల ప్రజలు

టేకులపల్లి: టేకులపల్లి మండలంలోని ప్రధాన కూడళ్ల వద్ద బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏదైనా పనుల మీద, శుభకార్యాలకు దూరప్రాంతాలకు వెళ్లాలంటే బస్సుల్లో, ప్రైవేట్ ఆటోలు, టాటా మేజిక్‌లలో వెళ్లాల్సి ఉంటుంది.

బస్సులు, ప్రైవేట్ వాహనాలు వచ్చేంత వరకు కాస్త నిలబడాలంటే అవకాశమే లేదు. రోళ్లపాడు క్రాస్‌రోడ్, బేతంపూడి క్రాస్‌రోడ్‌లలో పక్కా బస్ షెల్టర్లు నిర్మించినా అవి నిరుపయోగంగా ఉన్నాయి. ఇటీవల ఓ స్వచ్ఛంద సంస్థ తహసీల్దార్ కార్యాలయం, గ్రామ పంచాయతీ కార్యాలయం సెంటర్లలో బస్ షెల్టర్లను ఏర్పాటు చేశారు. ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అనిశెట్టిపల్లి క్రాస్‌రోడ్, బొమ్మనపల్లి, కారుకొండ క్రాస్‌రోడ్, రాజుతండా, సులానగర్, ముత్యాలంపాడు క్రాస్‌రోడ్, టేకులపల్లి సెంటర్, తొమ్మిదోమైలుతండా, సాయనపేట క్రాస్‌రోడ్ ప్రధానమైన సెంటర్లలో బస్ షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతం. ఎండాకాలం, వానాకాలంలో ప్రయాణికుల కష్టాలు మరింత ఎక్కువగా ఉంటున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే టేకులపల్లి మండలం పరిధిలోని ప్రధాన సెంటర్లలో బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలి



మండల కేంద్రంలో బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని, ప్రయాణికుల సంఖ్య పెంచాలని ప్రయత్నాలు చేయడం కాదు.. ప్రయాణికుల బాగోగులు కూడా చూడాలి. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రధాన సెంటర్లలో తక్షణమే బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలి.

– జర్పుల సుందర్, టీయూసీఐ నాయకుడు

ఎవరూ పట్టించుకోవడం లేదు..



బస్ ప్రయాణికులు గమ్యస్థానాలకు వెళ్లేందుకు బస్టాప్‌లలో సౌకర్యాలు లేక, బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు నానా తంటాలు పడుతుంటే ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ప్రతీరోజూ తీవ్ర ఇబ్బందులు పడుతూ బస్సుల కోసం వేచి చూడాల్సి వస్తోంది. ప్రభుత్వాధికారులు స్పందించి బస్ షెల్టర్లు నిర్మించాలి.

– కదుదుల వీరన్న, సీఐటీయూ నాయకుడు